క్లుప్తంగా

రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించండి



దీప

యాదమరి: అన్నదాత సుఖీభవ పథకంలో ప్రయోజనాలు అందని రైతులు తమ ఆధార్‌కార్డు, భూమి పాసుపుస్తకంతో సంబంధిత రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారి దీప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ ఫిర్యాదులను సంబంధిత వ్యవసాయ సహాయకులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని చెప్పారు. ఆధార్, భూమి లింకేజీకి సంబంధించిన సమస్యలు ఉంటే రెవెన్యూ స్థాయిలో పరిష్కరించుకోవాలని సూచించారు. రైతులు తమ ఫిర్యాదులను ఈనెల 20వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని చెప్పారు. ప్రధానమంత్రి కిసాన్ పథకం ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా అక్టోబర్ 10వరకు రైతు సేవా కేంద్రాల్లో అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రతి రైతు తాము పండించిన పంటలను ఈ–క్రాప్‌లో తప్పక నమోదు చేయాలన్నారు. ఇటీవల రేషనైలేషన్‌లో భాగంగా బదిలీపై వెళ్లిన వ్యవసాయ సహాయకుల స్థానంలో కొత్తవారు బాధ్యతలు స్వీకరించారన్నారు.

అట్టహాసంగా పార్కు ప్రారంభం



వెదురారణ్యం పార్కు ప్రారంభోత్సవంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న వెదురారణ్యం పార్కును శనివారం ఎంపీ దగుమళ్ల ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, కలెక్టర్ సుమిత్‌కుమార్, డీఎఫ్‌ఓ భరణి అట్టహాసంగా ప్రారంభించారు. అనంతరం పార్కు ఆవరణలో మొక్కలు నాటారు. పార్కు నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మేయర్ అముద, చుడాచైర్మన్ కఠారి హేమలత తదితరులు పాల్గొన్నారు.

బుసకొట్టిన నాగుపాము..



బుసకొడుతున్న పాము

పార్కు ప్రారంభోత్సవానికి 10 నిమిషాలకు ముందు పెద్ద నాగుపాము పార్కులో బుసలు కొట్టింది. పడగవిప్పి అందరినీ భయపెట్టింది. ప్రారంభోత్సవానికి వచ్చిన జనం పామును చూసి పరుగులు పెట్టారు. ఇంతలో పాము పొదల్లోకి వెళ్లడంతో ఊపిరి పీల్చుకున్నారు. పాముల బెడద ఇలా ఉంటే పిల్లలు పార్కుకు ఎలా వస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



గుర్తింపు దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారమే తమ సంఘం ప్రథమ ప్రాధాన్యత అని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య అన్నారు. ఈ మేరకు ఆ సంఘం గుర్తింపు దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఆ సంఘ కార్యాలయంలో జెండాను ఎగురవేసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ నాటికి తమ సంఘానికి గుర్తింపు వచ్చి ఆరేళ్లు పూర్తయిందన్నారు. ఈ ఆరేళ్ల కాలంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేశామన్నారు. నాలుగో తరగతి ఉద్యోగి నుంచి గ్రూప్ వన్ కేడర్ అధికారి వరకు ఎటువంటి సమస్యలు వచ్చినా పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం చిత్తూరు తాలూకా ఆధ్వర్యంలో రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కిషోర్, సురేంద్రనాథ్‌రెడ్డి, బాలు, విజయ్, కృష్ణమూర్తి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ శక్తి ..అంతా ఆర్భాటమే..



గాయత్రీదేవి

చిత్తూరు కార్పొరేషన్: ఉచితబస్సు పథకం ఆర్భాటమేనని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగ ప్రధాన కార్యదర్శి గాయత్రీదేవి విమర్శించారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అధికారంలో వచ్చి ఏడాదిన్నర కావొస్తున్న నేపథ్యంలో స్త్రీశక్తి పథకం అమలు చేస్తున్నారని.. అందులోనూ కొర్రీలు పెట్టడమేమిటని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు బస్సుల్లో ఎక్కడికైనా వెళ్లవచ్చని చెప్పారన్నారు. ఇప్పుడు కొన్ని కేటగిరి బస్సుల్లో మాత్రమే ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించారన్నారు. పథకం ప్రారంభమైన శుక్రవారం రాత్రి నుంచే పలు బస్సుల్లో ఉచిత ప్రయాణం లేదని బోర్డు పెట్టడం ఏంటని ఎద్దేవా చేశారు.

స్టైల్‌గా మొదలెడితే..
ఉఫ్‌మంటుంది లైఫ్..

తెలిసీ తెలియని వయసులో చేసుకున్న అలవాటు .. ఆపై ప్రాణాలమీదకు తెస్తోంది. సిగరెట్ తాగడాన్ని మొదట యువత సరదాగా తీసుకుని ఆ తరువాత దాన్ని అలవాటుగా చేసుకుని.. జీవితకాలపు వ్యసనంగా మారడంతో ప్రాణాలను హరించివేస్తోంది. వారి ఆయుర్దాయాన్ని సగానికి సగం తగ్గించేస్తుంది. ఒక్కో సిగరెట్ మనిషి జీవితకాలంలో ఒక్కో నిమిషాన్ని తగ్గిస్తుంది. ప్రాణాంతక వ్యాధులకు గేట్లు తెరిచి ఆహ్వానం పలుకుతుంది. నిండు జీవితాన్ని ఉఫ్‌మని ఊదేస్తుంది.

- మనిషి జీవిత కాలాన్ని తగ్గించేస్తున్న సిగరెట్
- ఏటా పెరుగుతున్న పొగాకు బాధితులు
- గుండెపోటు, పక్షవాతం, మధుమేహం, రక్తపోటుకు దారితీస్తున్న వైనం
- సరదాగా అలవాటు చేసుకుని ఆపై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న యువత


కాణిపాకం: పొగాకు ఉత్పత్తుల వినియోగం కారణంగా చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి ప్రతిరోజు 20 నుంచి 30 మంది వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. వారిలో ఎక్కువగా గుండె జబ్బులు, రక్తపోటు, మధుమేహం, లివర్, శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నారు. లంగ్, గొంతు క్యాన్సర్ బాధితులు ఇటీవల జిల్లాలో పెరుగుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం కారణంగా పొగ పీల్చే వారు సైతం పలు ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ధూమపానం కారణంగా నమోదైన క్యాన్సర్ కేసుల్లో 10 శాతం మందిలో సిగరెట్ తాగకపోయినా పొగ పీల్చడమే కారణంగా బాధితులవుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధంపై చట్టం వచ్చినా అది అమలుకు నోచుకోవడం లేదు.

అప్రమత్తతే రక్ష..

గుండెపోటు, పక్షవాతం బాధితుల్లో ధూమపానం చేసేవారే అధికంగా ఉంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు. అంతేకాదు ధూమపానం చేసే వారిలో దీర్ఘకాలిక వ్యాధులకు వాడే మందులు కూడా సరిగా పనిచేయవని చెబుతున్నారు. అలాంటి ధూమపానం విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. నేటి సమాజంలో ఫ్యాషన్ కోసం కొంతమంది సిగరెట్ తాగడాన్ని అలవాటు చేసుకుంటున్నారు. టీవీల్లో వచ్చే ప్రకటనలు, సినిమాల్లో హీరోలను అనుసరిస్తూ చాలామంది యువకులు పొగతాగడం అలవాటు చేసుకుంటున్నారన్నది వాస్తవం.

ఎలా మానేయాలంటే..!

- సిగరెట్ తాగాలనే ఆలోచన వచ్చినప్పుడు ఒక గంట వాయిదా వేసుకోండి. అలా చేస్తే రోజు మొత్తంలో తాగే సిగరెట్ల సంఖ్య కొంతవరకైనా తగ్గించుకోవచ్చు.
- బాగా సిగరెట్ తాగాలనిపించినప్పుడు నిలబడి లేదా కూర్చుని లోతైన శ్వాస తీసుకోండి. అప్పుడు ఓ గ్లాసు నీళ్లు తాగడం అలవాటు చేసుకోండి.
- సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు కళ్లెదుట దృష్టిలో పడకుండా ఉంచండి.
- సిగరెట్ తాగాలనిపించినప్పుడు నోట్లో చూయింగ్ గమ్, ఏదైనా స్వీట్, పిప్పర్ మెంట్ లాంటివి పెట్టుకుని, లోతైన శ్వాస తీసుకోవడం అలవాటు చేసుకోవాలి.
- పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పొగ తాగడానికి దూరమవుతాం.



ధూమపానంతో వచ్చే రుగ్మతలివే..

- పొగతాగడం వల్ల శరీర భాగాలైన గొంతు, ఊపిరితిత్తులు, కడుపు, మూత్రపిండాల క్యాన్సర్ సోకే అవకాశం ఉంది
- గుండె రక్తనాళాలు బిరుసుగా మారి హార్ట్ ఎటాక్‌కు దారి తీస్తుంది
- నాడీ సంబంధ వ్యాధులు, పక్షవాతానికి దారి తీస్తుంది
- మధుమేహం, రక్తపోటు, మానసిక రుగ్మతలకు కారణం
- దీర్ఘకాలిక వ్యాధులకు వాడే మందులపై ప్రభావం చూపుతుంది
- పురుషుల్లో నపుంసకత్వం, మహిళల్లో ఈస్ట్రోజన్ హార్మోన్ల సంఖ్య తగ్గి, రుతుక్రమం త్వరగా నిలిచిపోతుంది
- శారీరక సామర్థ్యం, ఎముకల పటుత్వం తగ్గుతుంది

వివరాలు

నెల	ఓపీల సంఖ్య
మార్చి	812
ఏప్రిల్	745
మే	612
జూన్	801
జూలై	762



చికిత్స చేస్తున్న వైద్యులు (ఫైల్)

నిర్లక్ష్యం చేయవద్దు..



ధూమపానం చేసేవారిలో మందులు పని చేయని పరిస్థితి నెలకొంటుంది. దీంతో మధుమేహం, రక్తపోటు ఉన్న వారు ధూమపానం చేస్తే మందులు వాడినా అదుపులోకి రావడం కష్టం అవుతుంది. ధూమపానం చేసేవారిలో మధుమేహం కారణంగా వచ్చే దుష్ఫలితాలు అధికంగా ఉంటాయి. కంటి రెటీనా సమస్యతో పాటు, సైలెంట్ హార్ట్ ఎటాక్, పక్షవాతం, కిడ్నీల సమస్యలు తలెత్తుతాయి. పాదాలకు పుళ్లు పడి తగ్గని పరిస్థితి ఉంటుంది. ధూమపానానికి దూరంగా ఉంటే మంచిది.

– నందీశ్వర్, పల్మనాలజిస్ట్ (అపోలో), జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

నేడు బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో ఆదివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక 10వ డివిజన్ సత్యనారాయణపురం వినాయక ఆలయం సమీపంలో ఉదయం 11 గంటలకు, అనంతరం 9వ డివిజన్ లక్ష్మినగర్‌కాలనీ పరిధిలోని షర్మస్ పాఠశాల సమీపంలో కార్యక్రమం ఉంటుందన్నారు. స్థానికులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

రూరల్ మండలంలో..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం తాళంబేడు పంచాయతీలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 11.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఆ తర్వాత ధర్మరాజుల గుడి వద్ద ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని ప్రత్యేక పూజలు చేపట్టనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు.

20న వాహనాల వేలం

పలమనేరు: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఈనెల 20వ తేదీ ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ భాగ్యలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ సూపరిండెంటెంట్ కృష్ణ కిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముందుగా నిర్ణయించిన రుసుం చెల్లించి వేలంపాటల్లో పాల్గొనాలని సూచించారు.

టాటాఏస్ వాహనం బోల్తా



రాళ్లపల్లె సమీపంలో బోల్తాపడిన వాహనం

బంగారుపాళెం: మండలంలోని రాళ్లపల్లె వద్ద శనివారం టాటాఏస్ వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. చిత్తూరు నుంచి రాళ్లపల్లెలో గల ఓ కోళ్లఫారానికి ఫీడ్ బస్తాలను తరలిస్తున్న టాటాఏస్ వాహనం గ్రామానికి వెళ్లే మలుపు వద్ద అదుపు తప్పి పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలయ్యాయి.

టాయ్‌లెట్లలో నీరు రాక..

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలోని టాయ్‌లెట్లలో నీరు రావడం లేదు. దీంతో కార్యాలయ సిబ్బంది, పనుల మీద వచ్చేవారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. శనివారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు వంద మందికి పైగా వచ్చారు. కానీ టాయ్‌లెట్లు, బాత్రూమ్‌లలో ఫ్లాష్‌లు పనిచేయడం లేదు. దీంతో మూత్రవిసర్జనకు వెళ్లినవారు నీరు రాక తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. వీటిని సరిచేయాల్సిన అవసరం ఉంది.

వేల్‌మురగన్‌కే హరోహరా..

- భక్తి ప్రపత్తులతో ఆడికృత్తిక పూజలు
- కావళ్లతో మొక్కులు చెల్లించిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో సుబ్రమణ్యస్వామి



కావళ్లతో వచ్చిన బాలుడు



గుడిపాల: కందగిరి కొండకింద భక్తులకు దర్శనమిస్తున్న వళ్లీ సమేత సుబ్రమణ్యస్వామి



అరగొండలో ప్రత్యేక అలంకరణలో వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

చిత్తూరు రూరల్(కాణిపాకం): వేల్‌మురగన్‌కే హరోహరా నామస్మరణలతో కొండ పులకరించిపోయింది. చిత్తూరు నగరంలోని చెంగాల్రాయ కొండపై వెలసిన శ్రీసుబ్రమణ్యస్వామి దేవస్థానంలో శనివారం ఆడికృత్తికను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఊరూరా భక్తులు కావళ్లతో తమిళనాడు రాష్ట్రం వళ్లిమలై, తిరుత్తణిలో మొక్కులు చెల్లించేందుకు క్యూకట్టారు.

కొండపై వసతులేవీ..!

చెంగాల్రాయ కొండపై ఏటా జరిగే ఆడికృత్తిక ఉత్సవానికి పెద్దఎత్తున ఏర్పాట్లు జరిగేవి. భక్తులు తాకిడి కూడా అధికంగా ఉండేది. అయితే ఈసారి కొండపై వసతులు శూన్యమనిపించాయి. దేవదాయశాఖ అధికారులు ఆలయానికి వచ్చే భక్తులకు కనీస వసతులు కల్పించలేకపోయారు. ప్రధానంగా తాగునీటికి భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. రూ.10, రూ.20 ఇచ్చి వాటర్ బాటిళ్లు కొనుగోలు చేశారు.

అరగొండలో

తవణంపల్లె: మండలంలోని అరగొండలో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం ఆడికృత్తిక ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అర్చకులు స్వయం భువనేశ్వర స్వామి, సుబ్రమణ్యేశ్వర స్వామికి అర్చకులు అభిషేకం చేశారు.

గుడిపాలలో..

గుడిపాల: మండలంలోని గ్రామాలన్నీ హరోహర నామస్మరణతో మార్మోగాయి. భక్తులు కావళ్లు ఎత్తారు. కందగిరికొండ వద్ద వెలసిన సుబ్రమణ్య స్వామి గుడివద్ద, తమిళనాడులోని వళ్లిమలై, తిరుత్తణికి భక్తులు మొక్కులు చెల్లించేందుకు వెళ్లారు.

శివాలయాల్లో పూజలు



కలశాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురం బోయకొండపై వెలసిన శ్రీవళ్లీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయంలో శనివారం ఆడికృత్తిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలాగే జలకంఠేశ్వరస్వామి, గంగమ్మ ఆలయాల్లో ఆడికృత్తిక సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. మొగిలి శివాలయంలో భక్తులు కావడి మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా అష్టమి పూజలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీకాళభైరవ ట్రస్టు ఆధ్వర్యంలో ఆడికృత్తిక, అష్టమి పూజలను వైభవంగా చేపట్టారు. ఉదయం కాళభైరవుడికి అభిషేక, హోమాది పూజలు చేశారు.

కమనీయం.. రాధారమణుల కల్యాణం



గుడిపాల: 197 రామాపురంలో శ్రీకృష్ణుడికి పూజలు



శ్రీవేణుగోపాలకృష్ణ ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



బంగారుపాళెం: శ్రీకృష్ణుడి ప్రతిమకు విశేష అలంకరణ



ఐరాల: బెస్తపల్లెలో ..



గుడిపాల: బట్టువాళ్లూరు గ్రామంలో ..

- అట్టహాసంగా కృష్ణాష్టమి వేడుకలు
- చిత్తూరు, పూతలపట్టులోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పోటెత్తిన భక్తులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): గోకులాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. నగరంలోని గిరింపేట గాయత్రినగర్‌లోని శ్రీవేణుగోపాల కృష్ణ దేవస్థానంలో ఉదయం నుంచి రాత్రి వరకు విశేష పూజలు వైభవంగా నిర్వహించారు. ప్రభాతభేరి, గోపూజ, అభిషేకం, 108 బిందెలతో అభిషేక పూజలు చేశారు. కల్యాణోత్సవాన్ని కనుల పండువగా చేపట్టారు. భక్తులకు అన్నదానం చేపట్టారు. సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమం, రాత్రి రుక్మిణి సత్యభామ సమేత, వేణుగోపాలస్వామిని పుష్పపల్లకిలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు కోండద, సభ్యులు పాల్గొన్నారు. అలాగే హైరోడ్డులోని శ్రీకృష్ణ ఆలయంలో పూజలు రాత్రి వరకు కొనసాగాయి. భక్తులు భారీగా తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. పలువురు చిన్నారులు చిన్నికృష్ణుడి వేషధారణలో ఆకట్టుకున్నారు. చర్చివీధిలోని శ్రీకృష్ణ ఆలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు.

బంగారుపాళెంలో ..

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెంలో ప్రబోధసేవా సమితి– ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజావీధిలో ప్రత్యేకంగా మండపం ఏర్పాటు చేసి వివిధ రకాల పుష్పాలతో స్వామి వారిని అలంకరించారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవాసమితి సభ్యులు బాలాజీ, ధనుంజయ మాట్లాడుతూ పట్టణంలో ఐదు రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తామన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

యాదమరిలో..

యాదమరి: మండలంలోని పలు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సాహంగా చిన్నారులచే ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

ఐరాలలో..

ఐరాల: మండలవ్యాప్తంగా గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. రాధ, కృష్ణుల వేషధారణలతో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శ్రీకృష్ణుడి చిత్రపటాలను ప్రత్యేకంగా కొలువుదీర్చారు.

గుడిపాలలో..

గుడిపాల: మండలవ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలు కనుల పండువగా జరిగాయి. ఆలయాల్లో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. సాయంత్రం కృష్ణుడి చిత్రపటాన్ని ఊరేగించారు.

గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటు చేయాలి

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు నగరంలో స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటు చేయాలని చిత్తూరు జిల్లా ఈడిగ గౌడ్ సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సర్దార్ గౌడు లచ్చన్న సేవలు మరువలేనివని.. అందుకు గుర్తుగా చిత్తూరు నగరంలో గంగినేని, కట్టమంచి చెరువుల వద్ద ఏదైనా ఒక చోట విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు.

మహాసభల పోస్టర్లు విడుదల



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. శనివారం వారు నగరంలోని గాంధీవిగ్రహం వద్ద మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలులో జరగనున్న రాష్ట్ర 28వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా సహాయ కార్యదర్శులు జనార్దన్, శివారెడ్డి నాయకులు పాల్గొన్నారు.

అప్పులు ఘనం.. అభివృద్ధి శూన్యం

- కూటమి ప్రభుత్వంపై విజయానందరెడ్డి విమర్శ
- నగరంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ



క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విజయానందరెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

చిత్తూరు కార్పొరేషన్: తొలి ఏడాది కూటమి పాలనలో అభివృద్ధి జరగకపోగా వేల కోట్ల అప్పులు మాత్రం మిగిలాయని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి విమర్శించారు. శనివారం నగరంలోని 39వ డివిజన్ పీహెచ్‌వాడ అమ్మవారి ఆలయం వద్ద నాయకులు మార, 20వ డివిజన్ ఇరువారంలో ఈశ్వరాగుడి సమీపంలో నాయకులు డేవిడ్, సూరి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందని ఆరోపించారు. ప్రతి పథకంలోనూ ఏదో ఒక మెలిక పెట్టడం ఈ ప్రభుత్వానికి అలవాటుగా మారిందన్నారు. సూపర్‌సిక్స్ పథకాల అమలులో విఫలమైన ప్రభుత్వం మిగిలిన హామీలను మరచిందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇంటింటికీ తిరిగి ఇచ్చిన బాండ్లు చిత్తు కాగితాలుగా మిగిలాయని ధ్వజమెత్తారు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి తదితర పథకాలు అమలు చేయకుండా వాయిదాలు వేస్తున్నారన్నారు. ప్రజలు ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నించే రోజు వస్తుందన్నారు. అనంతరం క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్, ఉద్యోగుల పెన్షనర్ల విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయసింహారెడ్డి, నాయకులు మధురెడ్డి, ఆనంద్, సునీల్, శీన, వినాయక, ఆర్ముగం, శరవణ, సీతాపతి, శివ, పిచ్చాండీ, అన్నామలై, నాని, వెంకటేష్, జయకుమార్, అప్పున్, పొన్వెల్, సుబ్రమణ్యంరెడ్డి, రమేష్, సూరి, ప్రభు, అభి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.